అడ్డు లేని ఉపాధి అక్రమాలు

ఉపాధి హామీ పథకంలో అక్రమాలు అరికట్టేందుకు ఏర్పాటు చేసిన కమిటీల ఊసేలేదు. గత ప్రభుత్వం పంచాయతీ స్థాయిలో ఉపాధి కమిటీలను ఏర్పాటుచేసింది. పనుల నిర్వహణలో పారదర్శకత పాటించేందుకు, కూలీలకు వంద రోజుల పనిదినాలు కల్పించేందుకు పది మంది సభ్యులతో కమిటీలు నియమించాలని నిర్ణయించింది. ఈ మేరకు గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక జీఓను కూడా విడుదల చేసింది. అయితే చిత్తూరు నియోజకవర్గంలో కమిటీల జాడ కనిపించడం లేదు. దీంతో అక్రమాలు చోటు చేసుకోవడమే కాకుండా, ఇష్టారాజ్యంగా పనులు కల్పిస్తున్నారు. చిత్తూరు నియోజకవర్గంలో 10,686 జాబ్‌కార్డులు ఉన్నాయి. వీరిలో జూన్ నెలకు సంబంధించి కేవలం 1200 మంది మాత్రమే పనులకు వెళ్తున్నారు.

– గుడిపాల

- ఊసే లేని ఉపాధి కమిటీలు
- నియామకాలు చేపట్టని అధికారులు
- నష్టపోతున్న కూలీలు


మొగరాళ్లపల్లెలో పని చేస్తున్న ఉపాధి హామీ కూలీలు


చీలాపల్లెలో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలు

కమిటీలు ఆయా పంచాయతీల్లో జరుగుతున్న పనులను తనిఖీ చేయడంతో పాటు వాడుతున్న మెటీరియల్, కూలీలకు కల్పిస్తున్న సదుపాయాలను పరిశీలించాలి. అర్హులైన వారికి జాబ్‌కార్డులు అందేలా చర్యలు తీసుకుంటాయి. తనిఖీల్లో కన్పించిన లోపాలను గ్రామసభలో తెలియజేయాలి. పనులు నాణ్యంగా జరిగేలా చూడాలి. అయితే పాలకులు, ఉన్నతాధికారుల్లో చిత్తశుద్ధి కొరవడడంతో కమిటీల ఏర్పాటు కావడం లేదు. దీంతో కూలీలకు పనుల ప్రదేశంలో సౌకర్యాలు లేక న్యాయం జరగడం లేదు. ఇక పనుల్లో అక్రమాలకు అడ్డు అదుపూ లేకుండా పోతోంది.

కొరవడిన పర్యవేక్షణ

నియోజకవర్గంలో పలు పంచాయతీల్లో పనులు చేసిన కూలీలకు వేతనాలు ఖాతాల్లో జమ కావడం లేదు. ఇప్పటివరకు నియోజకవర్గంలో 30 లక్షలు వరకు కూలీలకు డబ్బులు రావాల్సి ఉంది. ఉన్నతాధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కూలీల్లో కూటమిదే హవా

కూటమి నాయకులు కూలీలకు వస్తున్న దినసరి కూలీల్లోనూ తమకు వాటాలివ్వాలంటూ ఫీల్డ్ అసిస్టెంట్‌లపై ఒత్తిడులు తీసుకువస్తున్నారు. కొన్ని గ్రామాల్లో 10 మంది ఉపాధిలో కూలిపనులు చేసినట్లయితే తెలుగుదేశం కార్యకర్త అయిన ఒకరిని అందులో చేర్చాలని ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఒత్తిడి తేవడంతో మస్టర్‌లలో పది మందికి బదులు 11 మంది పని చేసినట్లు చూపుతున్నారు. ఈ విషయాన్ని పని చేసిన కూలీలకు చూపించరు. బిల్లులు మాత్రం కూలీల ఖాతాలో పడుతుంది. డబ్బులు తక్కువగా వచ్చిందని అడిగితే ప్రభుత్వం నుంచి నేరుగా ఖాతాలోకి వస్తుందని, అందులో తాము చేసేది ఏమీ ఉండదని ఫీల్డ్ అసిస్టెంట్‌లు చెప్పడంతో కూలీలు తెలియక మౌనంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంటున్నది. ఇలా మండలంలో వేలాది రూపాయలతో తెలుగుదేశం కార్యకర్తల జేబులు నిండుతున్నాయి. అధికారులకు తెలిసినా కూడా పట్టించుకోవడం లేదు. ఈ విషయం కూలీలకు అస్సలు తెలియడం లేదు.

కమిటీలో సభ్యులు

పంచాయతీ స్థాయిలో నియమించే కమిటీలో సర్పంచ్, ఆరుగురు స్థానిక సభ్యులు, గ్రామ సంఘం ప్రతినిధి ఒకరు, శ్రమశక్తి సంఘాల సభ్యులు ఇద్దరు ఉంటారు. కమిటీలో సగం మహిళలు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ జనాభా శాతం ఆధారంగా వారికి కూడా చోటు కల్పించాలి. కమిటీ ఆరు నెలలపాటు బాధ్యతలు నిర్వహిస్తుంది.

ఉపాధిలో కూలి గిట్టుబాటు అవ్వడం లేదు

ఉపాధి హామీ కూలీ పనులకు వెళ్తే కూలి గిట్టుబాటు కావడం లేదు. రోజుకు 200 నుంచి 220 వరకు వస్తుంది. రైతుల పనులకు వెళితే రూ.350 వరకు ఇస్తున్నారు. ఏం గోల్‌మాల్ చేస్తున్నారో తెలియడం లేదు. అడిగితే పని చేసినంత డబ్బులు మాత్రమే వస్తాయని సమాధానం చెబుతున్నారు.

– మునెమ్మ, ఉపాధి హామీ కూలీ

సౌకర్యాలు లేవు

ఉపాధి హామీలో పనులు చేసే చోట సౌకర్యాలు లేవు. గతంలో ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లు, తాగునీరు, షామియానా ఉండేవి. ఇప్పుడు అటువంటివి లేవు. అడిగితే ప్రభుత్వం నుంచి నిధులు రాలేదని అందు కోసం ఇంటి వద్ద నుంచే నీరు తెచ్చుకుంటున్నాం. కూలీ డబ్బులు కూడా సక్రమంగా ఇవ్వడం లేదు. కూలి గిట్టుబాటు కాకపోవడంతో ఆదివారం రోజు కూడా పనులకు వెళ్తున్నాం.

– కన్నయ్య, ఉపాధి కూలీ

క్లుప్తంగా

పది మంది జూదరుల అరెస్టు

యాదమరి: పేకాటరాయుళ్ల జూద క్రీడలకు యాదమరి పోలీసులు కళ్లెం వేసి కటాకటాల్లోకి పంపించిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్‌ఐ ఈశ్వర్ కథనం మేరకు.. మండల పరిధిలోని వరిగపల్లి గ్రామ శివారు ప్రాంతంలో కొంతమంది గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో దాడులు చేశామన్నారు. ఈ దాడులలో ఇరువారానికి చెందిన లక్ష్మణ్, చెర్లోపల్లికి చెందిన రంగన్, రాజశేఖర్, సురేష్, వరిగపల్లి చెందిన మురళి, మంగసముద్రానికి చెందిన యువరాజు, శివకుమార్, సంతపేటకు చెందిన సయ్యద్‌బాషా, ఓబనపల్లికి చెందిన బాలాజీ తదితర పదిమంది నిందితులను అరెస్టు చేశామని చెప్పారు. వీరి నుంచి రూ.6580 నగదును, 52 పేకాట ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. వరిగపల్లి గ్రామానికి చెందిన దాము అనే నిందితుడు పరారీలో ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రమాదకర వృక్షం కూల్చివేత


చెట్టును కూల్చుతున్న సిబ్బంది

యాదమరి: మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్లో ప్రమాదకర స్థితిలో కూలడానికి సిద్ధంగా ఉన్న చింతచెట్టును ఎట్టకేలకు అధికారులు కూల్చివేశారు. గత కొద్దినెలలుగా చింతచెట్టు జీవం లేక కూలడానికి సిద్ధంగా ఉన్నా అధికారులు స్పందించలేదు. దీంతో ఈదురు గాలులకు, వర్షాలకు చెట్టుకొమ్మలు బస్సు కోసం వేచి ఉండే ప్రయాణికులపై పడడంతో గాయాలపాలై ఆసుపత్రి పాలైన ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో వర్షాకాలం సమీపిస్తుండడంతో దీని నుంచి ప్రమాదం పొంచి ఉందని చెట్టును తొలగించాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు, పంచాయతీ అధికారులు మంగళవారం సిబ్బందితో చెట్టును కూల్చి వేశారు.

విరివిగా పెరటి తోటల పెంపకం


మాట్లాడుతున్న నాగపద్మిని

గుడిపాల: పెరటి తోటల పెంపకంపై ఆసక్తి చూపాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సంచాలకులు నాగపద్మిని అన్నారు. మంగళవారం పశుమంద ఎస్టీ కాలనీలోని రైతులకు పెరటితోటల పెంపకం(కిచెన్‌గార్డెన్)పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పెరటి తోటలపై కూడా అవగాహన కలిగి ఉండాలన్నారు. పెరటి తోటల పెంపకంలో యూరియాను అస్సలు వాడకూడదని, పేడ ఎరువులను మాత్రమే వినియోగించాలని వారికి సూచించారు. ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యత, పద్ధతులు, పర్యావరణం, మానవ ఆరోగ్యంపై ప్రభావం వివరాలను తెలియజేశారు. నవధాన్యాల సాగుపై వారికి అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు విత్తనాలను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్ర శాస్త్రవేత్త సంధ్యారాణి, వ్యవసాయాధికారి సంగీత పాల్గొన్నారు.

ఘనంగా నాగపంచమి వేడుకలు


నాగదేవత ప్రతిమలకు పూజలు

బంగారుపాళెం: మండలంలోని వజ్రాలపురం బోయకొండలో వెలసిన నాగాలమ్మ ఆలయంలో మంగళవారం నాగపంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయం ఆవరణలోని శ్రీజలకంఠేశ్వరస్వామి, గంగమ్మ ఆలయాలలో ప్రత్యేక పూజా కార్య క్రమాలను నిర్వహించారు. నాగాలమ్మ ఆలయం వద్ద ప్రత్యేక హోమం, కలశపూజా కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం నాగదేవత ప్రతిమలను విశేషంగా అలంకరించి పూజలు చేశారు. నాగపంచమిని పురస్కరించుకుని పరిసర గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని నాగదేవత పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో నాగదేవత ఆలయాల నిర్మాణకర్త, కర్ణాటక పీసీసీ ఓబీసీ ఉపాధ్యక్షుడు అట్లూరి వేణుగోపాల్‌గౌడ్ కుటుంబ సభ్యులు, కమిటీ సభ్యులు నాగరాజగౌడ్, శివ లింగయ్య, ఎల్లప్ప, మురళి, రాజేంద్రనాయుడు, రామ్మూర్తినాయుడు, శంకరయ్య, తులసి, బాబు, ఆలయ మేనేజర్ మొగిలప్ప, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో బుధవారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు 45వ డివిజన్ మంగసముద్రం భజనగుడి వద్ద, తదుపరి 46వ డివిజన్ ఓబనపల్లె గంగమ్మ గుడి, 48వ డివిజన్ అరగొండ రోడ్డు తంగవేల్‌కాలనీ మునీశ్వరగుడి వద్ద, 47వ డివిజన్ మంగసముద్రం ఆటోస్టాండ్ సమీపంలో, 49వ డివిజన్ తిమ్మసముద్రం వినాయకస్వామి ఆలయం వద్ద నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి స్థానికులు, నాయకులు, కార్యకర్తలు రావాల్సిందిగా కోరారు.

ధర్మస్థలి సంఘటనపై నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

చిత్తూరు కార్పొరేషన్: ధర్మస్థలి సంఘటనపై కర్ణాటక ప్రభుత్వం నిజాయితీగా విచారణ చేపట్టాలని నాయకులు నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం గాంధీ విగ్రహం వద్ద ఆంధ్రప్రదేశ్ మహిళ సమాఖ్య నాయకుల మాట్లాడారు. కర్ణాటక రాష్ట్రం ధర్మస్థలి పుణ్యక్షేత్రంలో మహిళలపై మానభంగాలు, హత్యలు జరిగినట్టు శవాలు ఉన్నట్టు ఆరోపణలు వస్తున్నాయన్నారు. ఇక్కడికి అనేక దేశాల నుండి భక్తులు వస్తుంటారన్నారు. భక్తులకు సంఘటనలపై అనుమానాలను నివృత్తి చేసే బాధ్యత కర్ణాటక ప్రభుత్వానికి ఉందన్నారు. పుణ్యక్షేత్రంలో జరిగిన సంఘటనపై ప్రభుత్వం నిజాయితీగా విచారణ చేసి నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు భవిష్యత్తు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు విజయగౌరీ, జమీలాబీ, కోమల, సుగుణ, బుల్లెమ్మ, కస్తూరి, జయలక్ష్మి, సుందరమ్మ, నాగమ్మ, హంస తదితరులు పాల్గొన్నారు.

నేడు పేదరిక నిర్మూలనపై సమీక్ష

తవణంపల్లె: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు పేదరిక నిర్మూలన అనే అంశంపై సమీక్షా సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. సమీక్షా సమావేశంలో మండల ప్రత్యేక అధికారి సూరిబాబు పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమానికి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొనాలని కోరారు.

అధునాతన పద్ధతులతో అధిక దిగుబడులు


మహిళలకు విత్తనాలు పంపిణీ చేస్తున్న డీఆర్‌సీ ఏఓ లక్ష్మీప్రసన్న

ఐరాల: రైతులు అధునాతన పద్ధతులపై అవగాహన పెంచుకుని తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించాలని డీఆర్‌సీ ఏఓ లక్ష్మీప్రసన్న సూచించారు. మంగళవారం మండలంలోని చిన్నస్వామిరెడ్డిపల్లెలో ఏఓ వరలక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక మహిళా రైతులకు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ రైతులు అధునాతన పద్ధతులపై ఎప్పటికప్పుడు అవగాహన కలిగి పెట్టుబడులు తగ్గించుకోవాలన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి జీవన ఎరువులు వాడుకోవాలన్నారు. ఘన జీవామృతం, ద్రవజీవామృతం, బీజ జీవామృతం, వేపగింజల కషాయం వీటిని తయారు చేసి పంటలకు వాడితే పంటలు మంచి దిగుబడి వస్తుందని చెప్పారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై మక్కువ పెంచుకోవాలన్నారు. వరి పంటను ఆశించే చీడ పురుగులు, తెగుళ్ల నివారణకు రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. డ్రోన్‌ల ద్వారా పురుగు మందులు వాడడంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం మహిళలకు కిచెన్ గార్డెన్‌కు అవసరమైన బెండ, మొక్కజొన్న, గోంగూర విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఈఓ శైలజ, వీఏఏలు పాల్గొన్నారు.

పశువులపై సర్వే ప్రారంభం


పాడి పశువులపై సర్వే చేపడుతున్న పశు వైద్యాధికారి సాయిసుధ

గుడిపాల: పాడి రైతులకు సంబంధించి పశువులపై గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నట్లు పశు వైద్యాధికారి సాయిసుధ తెలిపారు. గుడిపాలలోని పిళ్లారికుప్పంలో మంగళవారం పాడి రైతులకు సంబంధించి ఎన్ని పశువులు ఉన్నాయి, వాటికి బ్యాంకు రుణాలు అందుతున్నాయా లేదా, ఆర్థిక పరిస్థితులు ఏ విధంగా ఉన్నాయని సర్వే చేపట్టామన్నారు. డ్వాక్రా మహిళలకు బ్యాంకు లింకేజీ ద్వారా ప్రభుత్వం రుణాలు ఇచ్చి ఆదుకుంటోందని, ఇదే తరహాలో పాడి రైతులకు కూడా లోన్‌లు ఇచ్చే అవకాశం ఉందని, దీంతో ఆర్థికంగా రైతన్నలు ఎదుగుదలకు అవకాశం ఉంటుందని ఆమె తెలిపారు. వెటర్నరీ అసిస్టెంట్‌లు, గోపాలమిత్రల ద్వారా సర్వే కార్యక్రమం ప్రారంభమైందన్నారు. దీంతో పాడి పశువులు, మేకలు, గొర్రెలు ఎన్ని ఉన్నాయని లెక్క కడుతామన్నారు. వీటన్నింటిని పాడిరైతుల ఎదుటే యాప్‌లో అప్‌లోడ్ చేస్తామని తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 19 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 19 మందికి రూ.1.90 లక్షల జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి మంగళవారం తీర్పునిచ్చారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు గత రెండు రోజులుగా వాహనాలు తనిఖీ చేస్తుండగా పలువురు మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. మొత్తం 19 మందిపై కేసు నమోదు చేసి, కోర్టుకు తరలించారు. ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.1.90 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీలు

యాదమరి: యాదమరి పోలీసు స్టేషన్‌ను చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులు వెంటనే పరిష్కరించాలని ఎస్‌ఐ ఈశ్వర్‌ను ఆదేశించారు. అలాగే స్టేషన్ పరిసరాలను పరిశీలించి సీజ్ చేసిన వాహన వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని ఈ సందర్భంగా ఎస్‌ఐకు సూచించారు.

ఎల్ఆర్ఎస్ పథకాన్ని వినియోగించుకోవాలి

చిత్తూరు అర్బన్: లే–అవుట్ రెగ్యులరైజేషన్ (ఎల్ఆర్ఎస్) పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా కార్యదర్శులు, ఇంజినీర్లు చొరవ చూపించాలని చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ) నాగేంద్ర కోరారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులు, లైసెన్స్‌డ్ ఇంజినీర్లతో సమావేశం నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ ఈ ఏడాది జూన్ 30వ తేదీ వరకు అనుమతిలేకుండా వేసిన లే–అవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన ప్రజలు.. నామమాత్రపు రుసుములతో వాటిని క్రమబద్ధీకరించుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 18 వేల ఎకరాల్లో వేసిన లే–అవుట్లను క్రమబద్ధీకరించుకునే అవకాశం ఉందన్నారు. ఏళ్ల తరబడిగా అనుమతులేకుండా వేసిన లే–అవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన ప్రజలు.. క్రమబద్ధీకరణ కోసం ఎదురు చూస్తున్నారన్నారు. చిత్తూరు నగరంలో దాదాపు 36 లే–అవుట్లలో స్థలాలను క్రమబద్ధీకరించుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో పట్టణ ప్రణాళిక అధికారి శుభప్రద, టీపీఎస్, టీపీబీ, ప్రణాళిక సిబ్బంది పాల్గొన్నారు.

అంకాళమ్మకు పాలాభిషేకం


పాలబిందెలతో ఊరేగింపు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరం గుర్రప్పనాయుడు వీధిలోని అంకాళ పరమేశ్వరి ఆలయంలో మంగళవారం గరుడ పంచమి, నాగపంచమిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత కట్టమంచిలోని వినాయకస్వామి ఆలయంలో విశేష పూజలు చేశారు. అమ్మవారికి ఉత్సవాన్ని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేపట్టారు. అంకాళ పరమేశ్వరికి అభిషేకం చేయించారు. కార్యక్రమంలో నిర్వాహకులు కేఎం కుమార్, అర్చకులు కుమార్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రైతులు ఎన్‌పీఐసీ లింక్ చేసుకోవాలి

గుడిపాల: రైతులు ఎన్‌పిఐసి లింక్ చేసుకోవాలని వ్యవసాయాధికారి సంగీత తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఆగస్టు మొదటి వారంలో రైతులకు అన్నదాత సుఖీభవ–పీఎం కిసాన్ నగదును వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తారని ప్రభుత్వం తెలిపిందన్నారు. కావున గుడిపాల మండలంలో 4680 మంది రైతులను ఇందుకు అర్హులుగా గుర్తించామని, ఇందులో 74 మంది రైతులు ఎన్‌పీఐసీ లింక్ చేసుకోలేదని, వాటిని రైతన్నలు సరిచూసుకోవాలని సూచించారు. ఇందుకు సంబంధించి ఆయా రైతుసేవా కేంద్రాల్లో వ్యవసాయ శాఖ అసిస్టెంట్లను సంప్రదించాలన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన


మాట్లాడుతున్న వ్యవసాయాధికారి జి.ప్రవీణ్

తవణంపల్లె: ఆధునిక వ్యవసాయ పద్ధతులతో పంటలు సాగు చేయడంపై రైతులు దృష్టి సారించాలని తవణంపల్లె వ్యవసాయాధికారి జి.ప్రవీణ్ తెలిపారు. మంగళవారం మండలంలోని పుణ్యసముద్రంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు పంటల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి జి.ప్రవీణ్ మాట్లాడుతూ రైతులు యూరియా వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువులను వాడాలని సూచించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి మాధవి మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలన్నారు. వేరుశనగ సాగులో పాటించాల్సిన మెళకువలను వివరించారు. రైతులు చిరుధాన్యాలు సాగు చేయడంతో రైతులకు మంచి ఆదాయం వస్తుందని పేర్కొన్నారు. అనంతరం రైతులకు చిరుధాన్యాల విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విస్తరణాధికారిణి మోక్షేశ్వరి, రైతు సేవా కేంద్రం సిబ్బంది జ్యోతి, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

గర్భిణీలకు ప్రత్యేక వైద్యం

గుడిపాల: గర్భిణీలకు ప్రత్యేకంగా వైద్యసేవలు అందిస్తున్నట్లు గుడిపాల ప్రాథమిక వైద్యాధికారి చంద్రమహేష్ తెలిపారు. మంగళవారం బండపల్లె గ్రామంలో 104 వాహనం ద్వారా ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీల ఇంటి వద్దకు వెళ్లి వైద్యసేవలు అందజేయడంతో పాటు పౌష్టికాహారాన్ని తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని సూచనలు చేశారు. అనంతరం మోకాళ్ల నొప్పులు, షుగర్, బీపీ వ్యాధిగ్రస్తులకు చికిత్సలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది సంధ్య, రమాదేవి, ఇందుమతి, బాబు, కిషోర్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం తొలగింపు


అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తున్న అధికారులు

యాదమరి: మండల కేంద్రంలోని ఓ వీధిలో ఆరు అడుగుల మేర అక్రమంగా ఆక్రమించుకుని నిర్మించిన నిర్మాణాన్ని అధికారులు తొలగించారు. స్థానికుల కథనం మేరకు ప్రాథమిక పాఠశాల వీధిలో ఓ మైనారిటీ మహిళ నివాసం ఉంటోంది. అయితే వీధిలో నుంచి తన గృహంలోకి వెళ్లడానికి మెట్ల మార్గాన్ని సుమారు ఆరు అడుగుల మేర అక్రమంగా ఆక్రమించుకుని నిర్మాణం చేపట్టింది. దీంతో రాకపోకలకు ఇరుగుపొరుగు వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ప్రభుత్వ దారిలో అక్రమంగా ఎలా నిర్మిస్తారని సంబంధిత గృహ యజమానులను స్థానికులు ప్రశ్నించారు. దీంతో ఆమె ప్రశ్నించిన వారిపై పలు దుర్భాషలు మాట్లాడి దాడికి యత్నించడంతో సంబంధిత అధికారులకు సోమవారం ఫిర్యాదు చేశారు. స్పందించిన డిప్యూటీ ఎంపీడీఓ రామచంద్ర, పంచాయతీ కార్యదర్శి శివరాజు అక్రమ నిర్మాణం చేపట్టిన చోటుకి వెళ్లి పరిశీలించి సదరు మహిళకు చేపట్టిన నిర్మాణం తొలగించాలని ఆమెకు నోటీసులు అందజేశారు. ఆమె స్పందించకపోవడంతో మంగళవారం రెవెన్యూ, పోలీసుల సహాయంతో అక్రమ నిర్మాణాన్ని తొలగించారు.

గర్భవతులు ఆరోగ్య సూత్రాలు పాటించాలి


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ కేశవనారాయణ

తవణంపల్లె: గర్భవతులు ఆరోగ్య సూత్రాలు పాటించాలని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ కేశవ నారాయణ తెలిపారు. మంగళవారం మండలంలోని దిగువమోదలపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ కేశవనారాయణ గర్భవతులు ప్రతి నెలా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఐరన్ మాత్రలు వాడాలని వివరించారు. అనంతరం గర్భవతులకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు, రోగులను పరీక్షించి సూచనలు, సలహాలిచ్చి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం షెర్వాన్, ఎంఎల్‌హెచ్‌పీ పావని, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు సౌందర్య, నాగభూషణ, పుష్ప, అంగన్‌వాడీ కార్యకర్త సావిత్రి, రోగులు పాల్గొన్నారు.

పరచుకున్న పచ్చదనం


కలుపుతీతలో నిమగ్నమైన కూలీలు


ఎటుచూసినా పచ్చదనం

ఎటుచూసినా పచ్చదనమే కనిపిస్తోంది. కొద్దిపాటి కురిసినా వర్షానికి పచ్చదనం పరచుకుంది. దీంతో రైతన్నలు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది రైతులు పొలాల్లో బిజీబిజీగా గడుపుతున్నారు. మరికొంత మంది వేరుశనగతోపాటు మిగతా పంట పొలాలకు సంబంధించి కలుపుతీతలో నిమగ్నమయ్యారు. గుడిపాల మండలంలోని పాపసముద్రం, పిళ్లారికుప్పం, అడవిచేను, చిత్తపార ప్రాంతాల్లో అధికంగా వరి పంట సాగు చేశారు. గుడిపాల మండలంలో 270 ఎకరాల్లో వరిపంటను రైతులు సాగు చేశారు. ఈ ప్రాంతంలో ఎక్కడ చూసినా వరిపంటతో పచ్చదనమే కనిపిస్తోంది.